గోధ తెచ్చిన బాధ

ఎ. శ్యామలారాణి

“త్రేవరా!” విసుగ్గా కాలు విదుల్చుకున్నాడు నాటకాలరాయుడు రంగరాజు.

“నాన్నెగను నెగనంటే నెగను.... అంతే ...మీ ఎంట తీసుకెల్తావనండి.... నాటకాల్లో ఏపిస్తాననండి, అంతేకాని ‘నెగరా నెగరా’ అంటే నాన్నెగనండి!” కాళ్ళు వదలకుండానే అన్నాడు వాడు.

రంగరాజుకి చిక్కొచ్చి పడింది.

పొద్దుట్నుంచి సాగుతోందీ భాగోతం. తొలిరోజు రంగరాజు ట్రూపు వేసిన

డ్రామా చూపిన దగ్గర్నుంచి, మేనత్త దగ్గర ఆకతాయిగా పెరుగుతున్న పోలి గాడికి సడన్‌గా యాక్టరై పోవాలన్న బుద్ధి పుట్టింది. అంతే వచ్చిపడ్డాడు కాళ్ళమీద.

ముందులో అంతగా ఖాతరు చెయ్య లేదు రంగరాజు. కాని వాడు పట్టిన పట్టు వదిలేలా కనుపించటంలేదు.

"తిన్నగా మాట్లాడటమేనా చాత కాదు. కావి నాటకాల్లో వేస్తావా?" అన్నాడు వెక్కిరింపుగా.

"ఏందది? నిన్నటేల నాను మాటాడీ బాసలోనేగదా నాటకవాఁడినారు-నా నెందు కాడనేను!"

నవ్వుకున్నాడు రంగరాజు. నిజమే తొలిరోజు వాళ్ళు వేసిన నాటకమంతా పల్లెటూరి యాసభాషలోనే నడిచింది.

"భాష ఒక్కటే చాలదురా—నటన రావద్దూ?" అన్నాడు భయపెడుతూ.

"ఓసారి ఏపించి సూదురూ—మీకే తెలుస్తాది."

రంగరాజుకి వాడి ఉత్సాహం నిజం గానే చూడ ముచ్చటేసింది.

"నీ పేరేమన్నావ్?" అన్నాడు సాలో చనగా.

రప్పున కాళ్ళమీంచి లేచి నిలబడ్డాడు వాడు.

"పోలిసచ్చినోడా అంతాదండి మా యత్త. ఓరి పోలిగా! అంతారండి అంద రూనూ-మరేమోనండి-పోలయ్యండి నా అచలుపేరు" అన్నాడు వాడు సంబర పడుతూ.

"సరే.. ఈ వా ళ నుం డి నీపేరు పోలేష్‌గా మారుస్తున్నాను. జ్ఞాపకం ఉంచుకో. ఏదీ చెప్పు నీపేరు-పోలేష్!"

"పోలీస్."

"ఓరిబడుద్ధాయ్! పోలీసు కాదురా.... పోలేష్!"

"పో...లేస్!"

"ఏడ్చావులే ." అని సర్దుకున్నాడు రంగరాజు ప్రయాణ సన్నాహమవుతూ. తోవలో అక్కగారిని చూపి వెళ్ళాలని ప్రయత్నం, మేనగోడలు గురించి వీళ్ళు వాళ్ళు చెప్పిన మాటలు అతన్ని బాధిస్తు న్నాయి. పోలిగాడిని తీసుకుని ప్రయాణ మయ్యాడు.

"ఒసేయ్ వరం! లేవ్వే... ..ఓసి వరంబీ! ఎంతసేపే ఆ మొద్దునిద్దర? దరి ద్రవేఁ అంత నిద్దర. ఏవేఁ వరాలూ .. ఏదీ లేచావా లేదా?"

అలా అలా స్థాయి పెరుగుతున్న సుభద్ర గొంతువింటే వరం, వరాలు, వరంబి అనే ముద్దుపేర్లతో పిలవబడే వర మహాలక్ష్మికి హగల్. తల్లిగొంతు దగ్గర దగ్గరవుతూం దనేసరికి మంచంమీంచి చంగున ఓ దూకుదూకి దొడ్డి తోవగుండా నూతిగట్టు చేరుకుంటుంది ముఖం కడగ డానికి.

కాని- ఆరోజు వరంబి అలా చంగున దూకలేదు. లేవనూలేదు. అసలు భయ పడనే లేదు.

తల్లి ఎదురుగా వచ్చాక చీదరగా అదోలాచూసి దర్జాగా కాస్త ప్రక్కకి ఒరిగి, చేతిమీద తలాన్చుకుని "నన్ను వరం, గిరం అనకు . నేను రాణీ చిత్ర లేఖా దేవిని!" అంది రాజసంగా.

సుభద్రకి ఒళ్లు భగ్గుమంది.

"ఏమిటీ నువ్వు రాణీ చిత్రలేఖవా, నేకానూ రాణీ అప్పల కొండమ్మాంబిని,



పాచి ముఖందానా? మొహం కడగవే ముందు!" అంది చిరచిర లాడుతూ.

వరం బెదిరిపోలేదు.

"నేను చిత్రలేఖని!" అంది శాంతంగా.

"ఇంకా నిద్రమత్తొదలకపోతే బిందెడు నీళ్ళుతెచ్చి గుమ్మరించగలను - లేముందు" అని గదిమి. 'నా ఖర్మ ....నింట్లో చెట్టంత కూతురుండీ పిసరంత సాయంలేదు నాకు . ఈవిడగారు ఇక అత్తారింటికెళ్తే దీన్నిండి రోజూ వాళ్ళందరిచేతా నేనెన్ని దొబ్బులు తింటూండాలో' అని సణుక్కుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

అంతే ఆ రోజునుండి వరమహాలక్ష్మి ఒకేమాట అంటూంది. "నేను మీ వరాన్నికాను .. రాణీ చిత్రలేఖాదేవిని!"

ఈ మాటవిని విని ఒళ్ళుమండి సుభద్ర ఓరోజంతా కూతురికి తిండి పెట్టడం మానేసింది. వరం సొమ్మసిల్లి పడుకుందేకాని___మాట తిరగలేదు.

పూర్వం చలాకీగా ఉండే వరం బి మందకొడిగా తయారయ్యిందీ మధ్య. ఎటో చూస్తూ ఏమిటో ఆలోచిస్తుంటుంది. ఎవరికోసం చూస్తున్నావంటే "రాజా భవానీప్రసాద్ కోసం నాకోసం తప్పక వస్తాడతను" అంటుంది.

దయ్యమన్నారు - దేవరన్నారు-అదేం కాదు హిస్టీరియా అన్నారు కొందరు-తిని కూచుని పొద్దుపోక వెర్రి వేషాలని కూడా కొందరన్నారు.

అయితే వరలక్ష్మి తండ్రి అయిన వీర్రాజు మాత్రం 'ఒకవేళ ఇది పూర్వ జన్మ జ్ఞానమే అయివుంటే?' అనే మీమాంసలో పడ్డాడు.

సుభద్ర ఏదీ నిశ్చయంగా అనుకోలేకపోయింది.

"నా ఖర్మ ....నా ఖర్మ!" అని మాత్రం తల కొట్టుకుంటుంది.

అసలు కథ ఎక్కడ మొదలైం

దంటే—

ఆ ఊళ్ళో ఉన్న పదోక్లాసు వరకూ చదివేసాక, గోళ్ళు గిల్లుకుంటూ పొద్దు గడవక ఇంట్లో కూచున్న వరంటిలాంటి కుమారీ రత్నాలు కొందరు ఒకనాడు అక్కడికి ఆరుమైళ్ళదూరంలో ఉన్న లంగలూరు గెస్టుహౌస్‌లో వనభోజనాలేర్పాటు చేసుకున్నారు.

ఒకప్పుడు లంగలూరు జమీందార్లు ఓ వెలుగు వెలిగారు. ప్రస్తుతం వాళ్లెవ్వరూ లేరు.

జమీందారీలు పోయి చాలా కాలమయింది. అయితే అక్కడ మిగిలిందొక్క గెస్టుహౌసు మాత్రమే. అప్పట్లో విదేశీ దొరలకోసం కట్టించిన భవనమది. దాన్లో తరతరాలవారి చిత్రపటాలు-వారు వేటాడిన పులులు, జింకలు మొదలగు వన్యమృగాల ఆకృతులు లేదా శవాలు—వారు స్వారీచేసిన అశ్వరాజములు, ఏనుగులు, వారి పెంపుడుకుక్కల ఫోటోలతో, వారి గెడ్డపు గురువుల చిత్రపటాలతో నిండి ఉంటుందా భవంతి.

వరలక్ష్మి ఆ ప్రదేశం చూడ్డం అదే మొదటిసారి. అలనాటి వైభవాలు ఆ పిల్లనెంతో ఆకర్షించాయి.

రాజామహేశ్వరీప్రసాద్. రాజాభువనేశ్వరీప్రసాద్ తరువాత రాజాభవానీ ప్రసాద్... అంతతో వంశం అంతరించిపోయింది.

అక్కడొక హృదయవిదారకమైన గాథ చెప్పేరక్కడివాళ్ళు. అందగాడైన రాజాభవానీప్రసాద్ చిత్రలేఖ అనబడే అందాల భరిణను రహస్యంగా వివాహమాడి తీసుకొచ్చాడట. ఆమె పొరుగూరి జమీందారుని ఏకైక పుత్రికారత్నం. తరతరాలుగా వారికీ, వీరికీ మధ్య పచ్చగడ్డేస్తే భగ్గుమంటూంది.

తర్వాత కథంతా మామూలే. భవానీ ప్రసాద్ తండ్రి ఆ వివాహాన్ని సమ్మతించలేదు. చిత్రలేఖను బంధించారు. భటులామెను లాక్కుపోతున్నప్పుడు "చిత్రలేఖా! భయపడకు. నిన్ను, నన్నూ ఎవరూ వేరుచేయలేరు నిన్ను విడిపిస్తా, నీ కోసం వస్తా" నంటూ భటుల చేతుల్లో పెనుగులాడుతూ దర్బారుహాలు దద్దరిల్లేలా అరిచాడట భవానీప్రసాద్.

చిత్రలేఖ తర్వాత మరి కనిపించలేదట. భవానీప్రసాద్ మాత్రం మతి స్థిమితం కోల్పోయాడట "చిత్రలేఖా—చిత్రలేఖా ఎక్కడున్నా నీకోసంవస్తున్నా-వస్తున్నా" నంటూనే ఒకనాడు ప్రాణం విడిచాడట.

అంతలో వారికథే ముగిసిపోయింది. కొత్తగా కట్టించిన గెస్టుహౌస్ మాత్రం మిగిలి పాత భవనాలన్నీ నేలకూలిపోయాయి.

వరమహాలక్ష్మి రెప్ప కదల్చకుండా విందా గాథ.

రాజాభవానీ ప్రసాద్, చిత్రలేఖల చిత్రపటాలు చూస్తున్నకొలదీ ఆమె హృదయంలోంచీ దుఃఖం తన్నుకొచ్చింది. ఆపుకోలేక ఏడ్చేసింది. తోడవచ్చిన వాళ్ళు కొందరు ఆశ్చర్యపోతే కొందరు నవ్వారు.

"ఎవరికీ రాని దుఃఖం మన వరలక్ష్మికెందుకొచ్చిందర్రా!" అందోపిల్ల అనుమానంగా.

"ఏమో! పూర్వజన్మలో ఇదే ఆ చిత్రలేఖేమో." తనకున్న పరిజ్ఞానంతో

తన సందేహం వెలిబుచ్చింది కల్యాణి!

* * *

ఆ రాత్రి వరాలుకి నిద్రరాలేదు. బుర్ర నిండా గజిబిజిగా ఆలోచనలే. కళ్ళు మూసినా తెరిచినా భవానీప్రసాద్ అందాల చిత్రమే కళ్ళముందు మెదుల్తోంది. 'ఏమో, పూర్వజన్మలో ఇదే ఆ చిత్రలేఖేమో!' నన్న కల్యాణిమాట చెవుల్లో హోరుపెడుతోంది.

"అవునా?!" ఆశ్చర్యంగా తనలో తనే ప్రశ్నించుకుంది.

జన్మజన్మలబంధాలు ఈ జన్మకుకూడా వెంటాడుతాయన్న సత్యాన్ని నిరూపించే అనేకమైన సినిమాలు అప్పటికే చాలా చూసింది వరంబి. అదే సత్యాన్ని ఎన్నో కథల ద్వారా, నవలల ద్వారా తెలుసుకుంది. ఆ సినిమాల్లో, కథల్లో నాయికా నాయకు లిద్దరికీ ఎన్నో జన్మలనుండి తీరని కోరిక లీజన్మలో తీరిపోతాయి. ఒకరినొకరు చేరుకుంటారు. కథ కంచికెళ్తుంది.

'ఒకవేళ నిజంగా ఆ చిత్రలేఖనే నేమో!' అనుకోవడమేమిటి ఒళ్ళంతా విద్యుత్ ప్రాకినట్టయింది వరలక్ష్మికి. తనలోనుండి వరాలు బయటికిపోయి చిత్రలేఖ ప్రవేశించినట్లు అనిపించింది. రాజా భవానీప్రసాద్ కూడా తనలాగే మరొకచోట పుట్టి తనకోసం ఎదురు చూస్తున్నాడనిపిస్తోంది.

'నేను చిత్రలేఖనే-సందేహం లేదు' అనుకుంది దన్నుగా. అంతే ఏడుపు తన్నుకొచ్చింది.

'భవానీ... రాజా ...నేను చిత్రలేఖని ఎక్కడున్నావ్?' అంటూ ఆ రాత్రి ఏకాంతంగా చాలాసేపేడ్చింది. ఆ ఏడుపులో రాజా భవానీప్రసాద్ తనకోసం వస్తాడని గట్టిగా నమ్మింది.

అంతే-పొద్దుటే లేచి తాను చిత్రలేఖనని డిక్లేర్ చేసింది.

* * *

రంగరాజు తన నాటక సమాజం వాళ్ళందర్నీ పంపేసి పోలయ్యగాడిని మాత్రం వెంటపెట్టుకుని అక్కగారి ఊరొచ్చాడు.

"వరాలి కేమయిందే అక్కా?!" వస్తూనే అడిగాడు ఆందోళనగా.

"అదుగో—దానికోసం రాజా భవానీ ప్రసాద్ వస్తాట్ట-ఆ మామిడిచెట్టు దగ్గర పడేడుస్తూంది చూడు" అంది బాధగా సుభద్ర.

"ఒసేయ్ వరంబీ! ఏమిటే? ఏం జరిగింది? రాజా భవానీప్రసాదెవరు?" నాటక ఫక్కీలో అడుగుతూ వరలక్ష్మి దగ్గర కొచ్చేడు రంగరాజు.

'మామయ్యొచ్చా' డంటూ ఎప్పుడూ ఎదురు పరుగెత్తుకొచ్చే వరమహాలక్ష్మి చురచుర చూసింది.

"వరంబీ—సరంబీ అనకు—నేను రాణీ చిత్రలేఖని!" అంది.

ఫకాల్న నవ్వేడు రంగరాజు.

"సెభాష్! పేరెప్పుడు మార్చేసుకున్నావే? పేరు బానేవుందనుకో గాని, మీ మామ్మ వరాలమ్మ దయ్యమై తిరిగొచ్చి నిన్ను పట్టుకోగల్దు చూస్కో!" అన్నాడు అదే ధోరణిలో.

వరలక్ష్మి మాత్రం అతని ధోరణికి లొంగలేదు.

"అసలేమైందో చెప్పవే వరాలూ?



ఎందుకలా మీ అమ్మని, నాన్నని కాల్చుకు తింటావు? ఈ చిత్రలేఖ ఎవతి మధ్యన? దానిపేరు నువ్వు పెట్టుకోడవేఁవిఁటీ? నీకేమైనా మతీసుతీ వుందా లేదా?" అంటూ గట్టిగా ఝూడించాడు.

వరమహాలక్ష్మి చెక్కు చెదరలేదు.

రంగరాజు ప్రేమగా, సౌమ్యంగా, కరినంగా అన్ని అస్త్రాలూ ప్రయోగించి చూపి తెలుసుకున్నదేమిటంటే, మేనగోడలి సమస్య అంత సులభ సాధ్యమైనది కాదని.

"అక్కా! నా మాట విని ఓ మారు వాల్టేరు తీసుకెళ్ళి మెంటల్ హాస్పిటల్లో చూపిస్తేనో?" అన్నాడు చివరికి అక్కగారితో.

అంతే తాడెత్తున లేచాడు బావగారు వీర్రాజుగారు.

"పిచ్చంటావేఁవిటోయ్ వరాలికి?" అని మండిపడ్డాడు.

"అబ్బే.... నేనలా అనడంలేదు .... ఏదో?" అంటూ నసిగాడు రంగరాజు.

. "రంగా! జన్మాంతర బంధాలమీద నీకు నమ్మకముందా?" నెమ్మదిగా అడిగాడు వీర్రాజు.

"నా నమ్మకాల ఊసెందుకులెండి? మీరు నమ్ముతారా?" సూటిగా అడిగాడు రంగరాజు.

"అదేనోయ్-నేమా సరిగా చెప్పలేక పోతున్నాను. కాని మా తాతముత్తాతలు లుంగలూరు జమీందార్ల సరసన జమీందార్లుగా మసిలారు—దివాన్ పదవులేలారు. ఆ బంధాలేవో ఇంకా వదలటం లేదేమోనని...."

రంగరాజు తలపట్టుకున్నాడు.

*   *   *

రంగరాజు వచ్చి అప్పటికి వారం రోజులయింది. వరలక్ష్మిలో ఏమీ మార్పు లేదు. రంగరాజుకి ఇంకా వుండటానికి చాలా ఇబ్బందిగా అనిపించసాగింది. 'ఈ వెధవాకడు దాపురించాడు కదా నా ప్రాణా

నికి!' అని పోలిగాడిమీద విసుక్కున్నాడు.

ఓ ప్రక్క కూతురిగురించి బెంగతో కుళ్ళిపోతూ అందరికీ వార్చిపోసే అక్క గారిని చూస్తే జాలేస్తోంది.

"అక్కా! నే వెళ్తానే ఇక. వరాలు గురించేమీ బెంగ పెట్టుకోకు . . అదే నెమ్మదిగా సర్దుకుంటుందిలే. . . నీవంట్లోనే బాగులేదు....నాకూ, నాతోపాటు తగబడ్డ ఆ వెధవకీ ఎంతకని చేసిపెడతావు?" అన్నాడు చివరికి.

"నువ్వు కూడా వెళిపోతే నాకు మరంత పిచ్చెత్తి పోతుందిరా తమ్ముడూ! అది తిరిగి కాస్త మనలో పడేవరకూ నన్నొదిలెళిపోకురా బాబూ!" అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది సుభద్ర.

రంగరాజు ఇరకాటాన పడ్డాడు. అక్కడుండి తను చెయ్యగల ఉప కారమూ లేదు. వెళతానంటే అక్క ఏడుస్తుంది—ఏంచెయ్యడం? చివరికి ఉండక తప్పదని నిశ్చయించుకున్నాడు.

అప్పుడే ఎక్కడెక్కడో తిరిగి, కులా సాగా చుట్ట పొగ గుప్పు గుప్పు మని పించుకుంటూ ఇంట్లో అడుగు పెడు తున్నాడు పోలిగాడు.

"ఒరే పోలిగా!" చిరాగ్గా ఒక్క కేకే సాడు రంగరాజు.

"నాపేరు పోలేసని మీరే చెప్పినారు గదా! మళ్ళీ పోలిగా అంతా రేటండీ?" అని సణుక్కుంటూ వచ్చాడు వాడు.

రంగరాజుకి ఓపక్క ఒళ్లు మండి పోతూంది.

"ఏడ్చావులే కాని-తేరగామేసి చుట్ట కాల్చుకుంటూ ఊరల్లా బలాదూరు తిర గటం కాదు-ఇంట్లో పనోపాటో కాస్త చూస్తూండు-ఆ గొడ్ల పనేదో చూడ్డం— ఆ పాక క్లీన్ చెయ్యడం- ఆ మాత్రం చెయ్యలేవురా?" అని గదిమాడు.

"నాను సెయ్యనన్నానేటండీ? ఇయ్యాలకాడ్నించి సూభోండి!" అంటూ హుషారుగా అప్పుడే దొడ్ల పాకలో ప్రవేశించాడు వాడు.

* * *

రంగరాజు దసలే నాటకాల ప్రాణ మేమో, ఇలా అక్కగారి ఊళ్ళో ఊరికే గోళ్ళు గిల్లుకుంటూ కూచుందికి చికాగ్గా ఉంది.

ఇలా మరోవారం గడిచిపోయింది.

దూరపు బంధు వొకాయన వచ్చి వరంబికొక చక్కని సంబంధం చెప్పేడు. 'కుర్రాడు స్ఫురద్రూపి, మంచి స్థితిపరులు ..ఇంజనీరు....మీ కిష్టమైతే మీ వరలక్ష్మిని చేసుకుంటామంటున్నారు వాళ్ళు-ఎప్పుడో ఇదివరకొకసారి చూసా రట' అన్నాడతను.

"దాని మొహానికంత అదృష్టమా?" రహస్యంగా తల కొట్టుకుంది సుభద్ర.

"వారం, పదిరోజుల్లో మేమే కబురు పంపుతాంలెండి!" అంటూ సర్దేసి పంపిం చేసాడు రంగరాజు వరలక్ష్మి ప్రస్తుత పరి స్థితి గురించి చెప్పకుండా.

ఆరోజు రంగరాజు, వీర్రాజు, సుభద్ర ప్రాణాలు విసిగేవరకు వరంబికి ఎంతో బోధపరిచారు. ఇంత మంచి సంబంధం తేలిపోతే చాలా కష్టమని, ఆ దిక్కు మాలిన భవానీప్రసాద్ సంగతి మరచి పోమని గడ్డం పుచ్చుకు బ్రతిమాలేరు.

"లేదు.... రాజా భవానీప్రసాద్ నా

కోసం వస్తాడు. చిత్రలేఖకోసం వచ్చి తీరుతాడు!" అంటూ ఎప్పటి ధోరణిలోనే వుంది వరాలు.

"పూర్వ జన్మ స్మృతి కాక దీన్నేమంటావ్ చెప్పు?" నిస్పహాయంగా అడిగేడు వీర్రాజు రంగరాజుని.

"పిచ్చి!" అందామనుకున్నాడు రంగరాజు. కాని పులిలాంటి బావమరది. అందునా బంగలూరు దివాన్ల వారసుడు ఏం చేసిపోతాడోనని భయపడి నోరు మెదపలేదు.

* * *

ఓ రాత్రివేళ వరమహాలక్ష్మికి మెలకువొచ్చింది. కాలుమీద ఎలక పాకినట్లయింది. కాలు విదుల్చుకొని మళ్ళీ పడుకుంది.

కిటికీలోంచి పున్నమి చంద్రుడు తొంగి చూస్తున్నాడు. "రాజా... భవానీ" అనుకుంటూ తన్మయంగా కళ్ళుమూసుకోబోయింది.

మళ్ళీ ఎలక పాకినట్లయింది. అంతే కాదు కొంచెం గోళ్ళతో బరికినట్లు కూడా ఉంది.

కెవ్వుమని కేకేసి మంచంమీంచి లేచింది.

ఎదురుగా నవ్వుతూ పోలిగాడు.

భయంతో ఒక్కసారి గడ్డగట్టుకుపోయింది వరంబి.

"ఏటి చిత్త్రలేకా ... ఏటలా సూస్తన్నవ్? నానెవరో నీ కెరికినేదా? నాను చిత్రా .... నాను .. బవానీ పెసాదుని .... రాజా బవానీ పెసాదుని.... నీ బరతని.... చిత్రా ...నా రానీ!" అనుకుంటూ దగ్గరికి రాబోతున్నాడు పోలిగాడు.

ఠిక్కచచ్చిపోయున్న వరలక్ష్మికి ఒక్కసారి మైకం దిగినట్టుంది. 'తను చిత్రలేఖయితే ఈ వెధవ భవానీప్రసాదా!' ఆశ్చర్యంగా. కంపరంగావుంది వరాలుకి.

'ఛీ ... నేనసలు చిత్రలేఖని కాను ... వరలక్ష్మిని....వీర్రాజుగారి రమ్మాయి వరమహాలక్ష్మిని....వరాన్ని! వరాల్ని! వరంబిని!' పొంగుకొస్తున్న దుఃఖాన్నాపుకుంటూ. చురుగ్గా నాల్గువైపులా చూసింది.

గదిమూలగా చాపాటి కర్ర కనిపించింది.

పోలిగాడు వరలక్ష్మిని సమీపిస్తున్నాడు.

మెరుపులా తప్పుకుని. కర్రపుచ్చుకుని వాడినోరేవు పెడుతూ కేకలెయ్యడం ప్రారంభించింది.

అర్ధరాత్రివేళ ఆ అరుపులు చెవినపడటంతో కంగారుగా లేచివచ్చారంతా.

కళ్ళు నులుముకుని చూసాడు రంగరాజు.

వరలక్ష్మి వాడినింకా తంతూంది. పోలిగాడు మొర్రో మొర్రో మనిపోతున్నాడు.

"వరాలూ!" బిగ్గరగా అరచి వెళ్ళి ఆ కర్రందుకున్నాడు రంగరాజు.

"మాఁవయ్యా!" అంటూ రంగరాజు మీదపడి భోరున ఏడవడం ప్రారంభించింది వరాలు.

"ఏఁవయిందే? ఈ వెధవెందుకిక్కడున్నాడు?" గాభరాగా అడిగాడు రంగరాజు.

"నేను తలుపుదగ్గర చాపేసుకుని పడుకునుంటే .... మరే.... మరే .... ఈ వెధ

వేమో ..." వెక్కిలతో చెప్పలేక చెప్తొంది వరలక్ష్మి.

"ఈ వెధవటా.. .మరేమో.. రాజా భవానీప్రసాదట!" అంటూ మళ్ళీ బాంద్రు మంది.

అంతా కొయ్యబారిపోయారు. వీర్రాజే ముందు తేరుకున్నాడు.

"ఏం వెధవా! తోలొల్చేయాలేవిఁటి?" అన్నాడు మండిపడుతూ.

"మీ పిత్తం . .మీరేటి సేస్తే అది సెయ్యండి. రేత్తిరి ఉన్నపలంగా నా అసలు జలమ గాపకం ఒచ్చిపినాది.... నానూ పిత్తర్లేకా కిందటి జలమలో బార్యాబరతలం. కలిపి బతకనేక ఇడి ఇడిగా సచ్చిపోనాం....ఇప్పుడిలా మళ్లీ పుట్టినాం. నాను పిత్తర్లేక పెనివిఁటిని....పిత్తర్లేకా! నన్ను గురుతుపట్టనేదా? నారానీ! నన్నే దన్నినావా? అయ్యో దేవుడా! నా రాని సేతే నన్ను దన్నించిపినావా?!" అంటూ పోలిగాడు గోలపెట్టసాగేడు.

అందరికీ మతులు పోతున్నాయి.

"ఛస్ వెధవా! నోర్ముయ్! చుట్టపీకలా ముఖం నువ్వూను. నువ్వు రాజాభవానీ ప్రసాదువా? పోలిచచ్చిన వెధవా?" వీర్రాజు వీరావేశమెత్తిపోయి పోలిగాడిని ఎడాపెడా తగల్నిచ్చేడు.



"నాను పోలిచచ్చి నెదవని కాదు బాబోయ్! నాను బవానీపెసాదునే తండ్రోయ్—పిత్తర్లేకా! నువ్వయినా సెప్పవా....నా రానీ! నన్ను రచ్చించవా!" ఇన్ని తన్నులు తిన్నా అరుస్తూనే ఉన్నాడు వాడు.

ఇక లాభంలేదని రంగరాజు ఒడుపుగా పోలిగాడిని పట్టుకుని పక్కగదిలోకి తోసి తలుపులు మూసేసాడు.

"ఈ పాజీ వెధవట-గోచీకి గతిలేని వెధవట-రాజాభవానీప్రసాదట!" ఇంకా పళ్ళు నూరుతూనే ఉన్నాడు వీర్రాజు.

"బావా! వాడు చెప్తూన్న దొకవేళ నిజమోనేమో! ఆలోచించరాదూ! అసలిలాంటి నమ్మకాలులేని నాకుకూడా అనుమాన వొస్తూంది!" అన్నాడు రహస్యంగా దగ్గరకొచ్చి రంగరాజు.

"ఛీ! నీకు నోరెలా వస్తూందోయ్ అలా అనుకుందికి? ఈ గోచిపాత వెధవ రాజాభవానీప్రసాద్?" కస్సుమన్నాడు వీర్రాజు.

"ఏం? రాణీ చిత్రలేఖ మనం మరంబిగా పుట్టవచ్చును గాని భవానీప్రసాదు పోలిగాడుగా పుట్టకూడదేమిటి? ఏంవే వరాలూ! నువ్విన్నాళ్ళూ ఎదురు చూసిన రాజా...."

రంగరాజు మాట పూర్తికాకుండానే "ఛీ!" అంది వరలక్ష్మి.

"వీడుట్టి వెధవ! మాంవయ్యా. వాడి మాటలేం నమ్మకు. అయినా నేనేం చిత్రలేఖని కాను. ..నేను....నేను వరాల్ని ....మీ వరంబిని!" అంటూ మళ్ళీ కొంౘ్రుమంది వరమహాలక్ష్మి.

ఎలా వచ్చిన చిత్రలేఖ అలానే పోయింది.

అందరి ముఖాలు విప్పారేయి. కాని మూసిన తలుపులు బాదుతూ "నాను బవానీ పెసాదునే బాబోయ్!" అంటూ బొబ్బలు పెడుతూనే ఉన్నాడు పోలిగాడు.

* * *

మర్నాడుదయం—

వరమహాలక్ష్మికి పెళ్ళివారిని తీసుకు రావడానికి వీర్రాజు బయలుదేరాడు. ఆ ఇంజనీరు కుర్రాడ్ని తల్చుకుని వరాలో ప్రక్క మురిసిపోతూంది. సుభద్ర తిరపతి కొండ కొస్తానని మొక్కుకుంది.

"పిత్తర్లేకా—నారానీ!" అని ఇంకా పలవరిస్తూన్న పోలిగాడిని బలవంతాన బస్సెక్కించి తనూ ఎక్కాడు రంగరాజు.

బస్సు కదిలింది.

"సెభాష్‌రా పోలేష్! ఇక ఆపెయ్ ఆ ఏడుపు. యాక్టరువనిపించుకున్నావురా! చెప్పినట్టుగా నటించి నాటకం గొప్ప రక్తి కట్టించావురా పోలిగా!" అంటూ భుజంతట్టి అభినందించాడు రంగరాజు.

"ఒల్లకోండి బాబూ! ఒల్లు హూనవంయి పోనాది. ముందా వరాలమ్మ-ఆ ఎనకాల్ల బాబు కల్సి నా ఎంవిక విరిసేసినారు—ఓలమ్మో-నొప్పి!" బాధగా నడుం పట్టుకున్నాడు పోలిగాడు.

* * *

(అల్లిబిల్లి ఊహా లోకాల్లో అందంగా విహరిస్తూ చిలిపి గారడీలుచేసే టీనేజర్స్‌కి చిరుకానుక.) □